సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శుక్రవారం । 31 । మార్చి । 2023



ఈతకు వెళ్లి అనంతలోకాలకు..

అన్నమయ్య జిల్లా కురబకోట మండలం కంటే వారిపల్లెలోని చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి జయంత్(13) మృతి చెందాడు. - 8లో



అంతరిక్ష కేంద్రం.. రండి చూసొద్దాం

విద్యార్థులను శాస్త్ర,సాంకేతిక రంగాల వైపు మళ్లించేందుకు ఇస్రో కృషి చేస్తోంది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.7/26.0

జిల్లాలో గురువారం 26.0 - 38.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
కడప	6.30	4.55
ప్రొద్దుటూరు	6.28	5.00
పులివెందుల	6.33	5.03

న్యూస్‌రీల్

నేడు కడపలో శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ

కడప సెవెన్‌రోడ్స్: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి సంస్మరణ సభ శుక్రవారం ఉదయం 10.00 గంటలకు కడప నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నామని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రామసుబ్బారెడ్డి, బీవీ నాగిరెడ్డి, మిత్ర బృందం నాయకుడు వై.నాగిరెడ్డిలు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హోంశాఖ మాజీ మంత్రి డాక్టర్ ఎంవీ మైసూరారెడ్డి హాజరవుతారన్నారు. అలాగే జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్యేలు ఎస్.రఘురామిరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ప్రభుత్వ అంతర్ రాష్ట్ర సంబంధాల సలహాదారు దేవులపల్లి అమర్, సీనియర్ ఎడిటర్ కె.రామచంద్రమూర్తి, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, రాయలసీమ ఉద్యమ నాయకులు సీహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, భూమన్‌లతోపాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

జైళ్లశాఖ డీఐజీ కార్యాలయం తనిఖీ

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారం పక్కనే ఉన్న జైళ్లశాఖ రాయలసీమ డీఐజీ కార్యాలయాన్ని ఆ శాఖ ఐజీ డాక్టర్ ఇండ్ల శ్రీనివాసరావు తనిఖీ చేశారు. బుధవారం సాయంత్రం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు రికార్డులను వార్షిక తనిఖీలలో భాగంగా పరిశీలించారు.

డాక్టర్ అచ్చెన్న హత్యపై నేడు విచారణ

కడప కార్పొరేషన్: పశుసంవర్థక శాఖలో డీడీగా పనిచేస్తూ హత్యకు గురైన డాక్టర్ అచ్చెన్న మృతిపై ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ విచారణ చేయనున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహానికి ఎస్సీ కమిషన్ చైర్మన్ చేరుకుంటారని, అనంతరం అచ్చెన్న మృతి చెందిన ప్రదేశానికి వెళ్తారన్నారు. తర్వాత అధికారులతో చర్చిస్తారని, ప్రజల వినతులు స్వీకరిస్తారని చెప్పారు.

● వైవీయూ

చెంతనే ఏఎఫ్‌యూ

● 110.36 ఎకరాలు కేటాయిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
● రూ.345 కోట్లతో నిర్మాణాలకు ప్రతిపాదనలు



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూకు కేటాయించిన స్థలం

ఏఎఫ్‌యూ: వైఎస్ఆర్ జిల్లా కడప నగరంలో 2020లో ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి సొంతభవనాలకు మార్గం సుగమమైంది. పెండ్లిమర్రి మండలం గంగనపల్లె గ్రామపరిధిలోని 17/1, 17/2 తదితర సర్వే నంబర్లలో 110.36 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కాగా గతంలో కడప నగర పరిధిలోని చలమారెడ్డిపల్లెలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసేందుకు స్థల కేటాయింపులకు కేబినెట్ ఆమోదం తెలుపగా, తాజాగా ఆ స్థలాన్ని యోగివేమన విశ్వవిద్యాలయానికి పక్కనే ఉన్న ప్రాంతానికి బదిలీ చేశారు. దీంతో వైవీయూ ప్రాంతంలో డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ఆ ప్రాంతం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారుతుందనడంలో సందేహం లేదు.

కేంద్రనిధులకు యత్నం..

14 స్పెషలైజ్డ్ కోర్సులతో రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయంగా ఏర్పాటైన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి రాష్ట్ర నిధులతో పాటు కేంద్రనిధులు తీసుకువచ్చేందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారు. ఇందుకోసం ఆయన గతంలో కేంద్ర ఆర్థికశాఖమంత్రి నిర్మలాసీతారామన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌లను కలిసి డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూకు రూ. 250 కోట్లు కేటాయించాలని విన్నవించారు. దీంతో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కేంద్రం నిధులు కేటాయించమని కోరిన లేఖను కేంద్రమంత్రులకు అందజేసి నిధులు రాబట్టే యత్నం చేస్తున్నారు.

శాశ్వత నిర్మాణాలకు ప్రతిపాదనలు..

విశ్వవిద్యాలయం నెలవారి అద్దె చెల్లించి ప్రస్తుతం గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలోని భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. వీలైనంత త్వరగా సొంత భవనాలు సమకూర్చుకుని అందులోకి మారాలన్న లక్ష్యంతో అధికారులు పనులను వేగవంతం చేశారు. ఇందులో భాగంగా రూ.345 కోట్లతో శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టాలన్న దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన చేయించాలన్న ఆలోచనలో విశ్వవిద్యాలయ అధికారులు ఉన్నారు. దీనికి సంబంధించి ప్రక్రియను వేగవంతం చేసేందుకు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి సన్నాహాలు ప్రారంభించారు.

త్వరలోనే శాశ్వత భవనాలకు శంకుస్థాపన



ప్రభుత్వం విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణాలకు 110.36 ఎకరాల స్థలాన్ని కేటాయించడం సంతోషంగా ఉంది. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా భూమిపూజ, శంకుస్థాపన నిర్వహించేందుకు ప్రయత్నిస్తాం. దీంతో యూనివర్సిటీకి శాశ్వత భవనాలు సమకూరుతాయి.

– ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్, వైస్ చాన్సలర్, డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ

రూ. 345 కోట్లతో నిర్మాణ పనులు



రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయ శాశ్వత భవన నిర్మాణాలకు స్థలం కేటాయించడం సంతోషంగా ఉంది. దీంతో పాటు నిర్మాణాలకు రూ.345 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఇందుకు సహకరించిన జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు.

– ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన ఏకశిలానగరి(ఒంటిమిట్ట)లో జాంబవంతుడు ప్రతిష్ఠించిన శ్రీ కోదండరామస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు గురువారం శ్రీ రామనవమి సందర్భంగా ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిపించారు. తొలుత ఉత్సవ నిర్వాహకుడు రాజేష్‌భట్టర్‌ను సంప్రదాయబద్ధంగా ఆలయంలోకి తీసుకువచ్చారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 4 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు.

నేడు ధ్వజారోహణం: శుక్రవారం ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య వృషభలగ్నంలో ధ్వజారోహణం జరగనుంది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం , రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు శేషవాహన సేవ ఉంటాయి.



అంకురార్పణ పూజ నిర్వహిస్తున్న వేద పండితులు

కమనీయం.. రామయ్య కల్యాణం

కడప కల్చరల్ : నీలి మేఘాలన్నీ శ్రీరాముని రూపు దాల్చాయి. సూర్యకాంతులన్నీ సీతమ్మ రూపాన్ని సంతరించుకున్నాయి. ప్రకృతి పరవశించి ఆ సమ్మోహన రూపాలను ఆనందంగా తిలకిస్తున్నాయి. ఆ ఆదర్శమూర్తుల కల్యాణోత్సవాన్ని తిలకిస్తూ సంబరపడ్డాయి. ఆ దివ్యమంగళరూపం చూడటానికి రెండు కళ్లు చాలవు. కన్నార్పితే కమనీయమైన ఆ దృశ్యం చూడలేమని భక్తులు ఒళ్లంతా కళ్లు చేసుకుని సీతమ్మ, రామయ్యల కల్యాణాన్ని తిలకించారు. పందిళ్లు కల్యాణానికి గొడుగు పట్టగా, పూలబాలలు మంచి గంధాన్ని అందించాయి. ఆరటి పిలకలు, మామిడి తోరణాలు శ్యామసుందరుని కల్యాణానికి శోభనిచ్చాయి. హాయి గొలిపే మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చాటనల మధ్య జగన్మాత జానకి గళసీమలో జగన్నాథుడు శ్రీరామచంద్రుడు మంగళ సూత్రం అలంకరించాడు. ఈ దృశ్యాన్ని తిలకించిన భక్తు లంతా తన్మయత్వంతో పులకించారు. జై శ్రీరామ్ అంటూ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలోని శ్రీ రామాలయాలు మార్మోగాయి. కల్యాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణాలు సందడిగా మారాయి. గురువారం శ్రీరామ నవమి సందర్భంగా రామాలయాలలో ఉదయం 5 గంటల నుంచి మూలమూర్తులకు విశేష అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకరించారు. 10 గంటల నుంచి కల్యాణాల సందడి ప్రారంభమైంది. దాదాపు ప్రతి ఆలయం వద్ద కల్యాణాలు వైభవోపేతంగా సాగాయి. ప్రత్యేక వేదికలపై కొలువుదీర్చిన రామయ్య, సీతమ్మల ఉత్సవ మూర్తులు నూతన వధూవరులుగా భక్తులను కటాక్షించారు. స్థానిక ప్రముఖులు కల్యాణోత్సవాలకు హాజరయ్యారు. అన్నిచోట్ల భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు.

చంద్రబాబు ఒక మ్యానిపులేటర్

● పోలవరంలో జరిగిన తప్పిదాలకు బాబుదే బాధ్యత
● ఆ తప్పులు సరిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రయత్నం
● మంత్రి అంబటి రాంబాబు



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి అంబటి, చిత్రంలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

ఒంటిమిట్ట: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఒక మ్యానిపులేటర్ అని, ఆయన వ్యవస్థలను మేనేజ్ చేసి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నారని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గురువారం ఒంటిమిట్టలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోలవరంలో జరిగిన తప్పిదాలన్నింటికీ గత ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. టీడీపీ తప్పిదాల వల్లే పోలవరంలో సమస్యలు వచ్చాయని, వాటిని సరిచేసేందుకే నేడు రూ.10వేల కోట్లు కావాలని అడిగేందుకు కేంద్రం వద్దకు ముఖ్యమంత్రి వెళ్లారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పునర్నిర్మాణం చేసేది ఆయన ఆస్తులను, కొడుకు లోకేష్‌నే అన్నారు. ఎల్లో మీడియా మద్దతుతో చెయ్యని పనులు కూడా చేశానంటూ చెప్పుకుంటూ బతికే అసమర్థుడు చంద్రబాబు అన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

● ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం
● జిల్లాలో 146 పరీక్షా కేంద్రాలు
● హాజరు కానున్న 27,211 మంది విద్యార్థులు



పది పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకు అనుగుణంగా విద్యార్థులంతా సిద్ధమవుతున్నారు. అధికారులు కూడా పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. గత ఏడాది పదవ తరగతి పరీక్షలలో ఏడు పేపర్లు ఉండగా ఈ ఏడాది ఆరు పేపర్లకు కుదించారు. అలాగే ఓఎంఆర్ షీట్‌తో కూడిన 24 పేజీల జవాబు పత్రంలోనే విద్యార్థులు జవాబులు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నపత్రాల లీకేజీ అరికట్టే చర్యల్లో భాగంగా ఈ ఏడాది ప్రతి ప్రశ్నపత్రంపై సీరియల్ నంబర్ కేటాయించినట్లు తెలిసింది. సీరియల్ నెంబర్ ఆధారంగా పరీక్షా కేంద్రాన్ని గుర్తించే వీలుంటుంది.

146 పరీక్షా కేంద్రాలు: జిల్లాలో 589 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 146 పాఠశాలలను పరీక్షా కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. 146 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 146 మంది డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. 13 మంది రూట్ ఆఫీసర్లు, 13 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, ఏడు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. కాగా జిల్లా పరిధిలో 27,211 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1061 మంది సప్లిమెంటరీ విద్యార్థులతో పాటు 1549 మంది ఒకేషనల్ విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. హాల్ టికెట్లను విద్యార్థులు నేరుగా ఎస్ఎస్‌సి బోర్డు వెబ్‌సైట్ బీఎస్‌సి.ఏపీ.జీవోవీ.ఇన్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చు.

పకడ్బందీ ఏర్పాట్లు



పది పరీక్షల నిర్వహణ కోసం అసరమైన అన్ని ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలను కూడా ఆయా పోలీస్ స్టేషన్లకు చేర్చి భద్రపరిచాము. విద్యార్థులు ఎలాంటి ఆందోళన, ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా పరీక్షలను రాయాలి. నిర్ణీత సయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.


– వై.రాఘవరెడ్డి, డీఈఓ

అల వాల్మీకిపురంలో..



శ్రీధర్, సునీల్.. సోదరులిద్దరికీ క్రికెట్‌పై ప్రేముంది.. అంతకు మించి ప్రతిభా ఉంది. అంతేనా.. నాన్న పంచిన ప్రతి రక్తపు బొట్టులోనూ 'ఆట' దాగుంది. మంచి క్రికెటర్లుగా పేరుంది. ఇదే కోచింగ్ అకాడమీకి నాంది పలికింది. ఇది ఏటా వందలాది మంది నైపుణ్యం కలిగిన క్రికెటర్లను సమాజానికి అందించే వేదికైంది.

● మారుమూల ప్రాంతంలో క్రికెట్ కోచింగ్ సెంటర్
● 20 ఏళ్లుగా నిర్వహిస్తున్న సోదరులు
● తల్లిదండ్రుల స్ఫూర్తితో ఔత్సాహికులకు తర్ఫీదు
● సొంత నిధులతో గ్రౌండ్ ఏర్పాటు



వాల్మీకిపురంలో శ్రీధర్, సునీల్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానం (ఇన్‌సెట్) అకాడమీలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న సునీల్

(సాక్షి, కడప డెస్క్)

వాల్మీకిపురంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన గుండ్లూరు చంద్రశేఖర్, సుబ్బలక్ష్మి దంపతుల సంతానం శ్రీధర్ కుమార్, సునీల్ కుమార్. చంద్రశేఖర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. సుబ్బలక్ష్మి గృహిణి. చంద్రశేఖర్ నేషనల్ టెన్నికాయిట్ చాంపియన్. క్రికెటర్ కూడా. దంపతులిరువురూ తమ కుమారులను గొప్ప క్రికెట్ ఆటగాళ్లుగా చేయాలని తపించారు. ఆ మేరకు అన్ని రకాలుగా ప్రోత్సహించారు. శ్రీధర్, సునీల్‌లు పలు విభాగాల్లో మంచి క్రికెటర్లుగా రాణించారు. అనంతరం వాల్మీకిపురం క్రికెట్ క్లబ్ ఏర్పాటు చేశారు. అక్కడే కోచింగ్ కేంద్రాన్ని నిర్వహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాల్లాంటి క్రీడాకారులను సాన పడుతున్నారు.

ప్రతిభామూర్తులు..

క్రికెట్ కోచింగ్ కేంద్రాన్ని స్థాపించిన సోదరులు శ్రీధర్, సునీల్‌లు మంచి ఆల్‌రౌండర్లు. గతంలో వివిధ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించారు. శ్రీధర్ యూనివర్సిటీ, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించి ప్రశంసలు పొందారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన ఆయన ప్రస్తుతం పెద్దమండ్యం మండలం కలిచెర్ల జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సునీల్ యూనివర్సిటీ స్థాయి పోటీల్లో రాణించి క్రికెటర్‌గా మంచి గుర్తింపు పొందాడు. ఎమ్మెస్సీ, బీఈడీ చదివిన ఈయన బీసీసీఐ లెవల్-1 కోచ్‌గా ఎంపికయ్యారు. 2012 నుంచి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్‌లో ఉద్యోగిగా కొనసాగుతూ మదనపల్లె డివిజన్ క్రికెట్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

20 ఏళ్లుగా ..

వాల్మీకిపురం వద్ద నెలకొల్పిన క్రికెట్ కోచింగ్ సెంటర్ ద్వారా 20 ఏళ్లుగా వందలాది మందికి శిక్షణ ఇచ్చారు. ప్రతి ఏడాది వేసవి కాలంలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ క్యాంప్‌నకు 100 మంది వరకు వచ్చి శిక్షణ పొందుతారు.

ఎంఎస్‌కే చొరవతో..

ఇక్కడ నిర్వహిస్తున్న క్రికెట్ కోచింగ్ కేంద్రాన్ని 2011లో బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్, ఏసీఏ డైరెక్టర్ అయిన ఎంఎస్‌కే ప్రసాద్ సందర్శించారు. ఉచిత శిక్షణా కేంద్రంలో తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. క్రికెట్‌లో కొన్ని మెళకువలు తెలియజేశారు. సునీల్, శ్రీధర్‌లు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం 2012లో ఈ కేంద్రానికి ఒక క్రికెట్ కోచింగ్ సబ్‌సెంటర్‌ను మంజూరు చేయించారు. ఒక మారుమూల ప్రాంతానికి కోచింగ్ సెంటర్ మంజూరు కావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

తల్లిదండ్రుల స్ఫూర్తితో..

శ్రీధర్, సునీల్‌ల తల్లి సుబ్బలక్ష్మి 2006లో, తండ్రి చంద్రశేఖర్ 2017లో మృతి చెందారు. వారి స్ఫూర్తి, జ్ఞాపకార్థం ఈ సోదరులిద్దరూ తమ స్వంత నిధులతో 11 ఎకరాలను కొని అందులో ఆరు ఎకరాలను క్రికెట్ మైదానంగా మార్చారు. 2020లో గుండ్లూరు వెంకట సుబ్బలక్ష్మి, చంద్రశేఖర్ (జీవీఎస్‌సీఎస్)ల పేరిట క్రికెట్ గ్రౌండ్ ప్రారంభించారు.

రాష్ట్రస్థాయిలో..

ఇక్కడ శిక్షణ పొందినవారిలో ఐదుగురు రాష్ట్రస్థాయి అండర్-19, అండర్-16, అండర్-14 క్రికెట్ విభాగాల్లో ఎంపికయ్యారు. సౌత్‌జోన్ స్థాయిలో ముగ్గురు, యూనివర్సిటీ స్థాయిలో 30 మంది, జిల్లా స్థాయి పోటీలకు 150 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరంతా ఆయా స్థాయిల్లో జరిగిన వివిధ రకాల క్రికెట్ పోటీల్లో రాణించారు. క్రికెట్ సబ్ సెంటర్‌లో శిక్షణ పొంది రాణించిన ఎంతో మంది క్రీడాకారులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసుల్లో కూడా ఉన్నారు.

జాతీయస్థాయి క్రికెటర్లుగా తీర్చిదిద్దుతాం



గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయస్థాయికి క్రీడాకారులు ఎదిగేలా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఇందుకు అనుగుణంగా శిక్షణ ఇస్తున్నాం. మెళకువలు నేర్పించి వారి ప్రతిభకు పదును పెడుతున్నాం. వేసవి శిక్షణా శిబిరాలు, జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు మాపై మరింత బాధ్యతను పెంచాయి. మా కోచింగ్ సెంటర్‌లో చిన్న పిల్లల నుంచి సీనియర్ క్రీడాకారుల వరకు నిరంతరం శిక్షణ తీసుకొంటున్నారు. అన్నమయ్య జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా క్రీడాకారులు ఇక్కడికి వచ్చి శిక్షణ పొందుతున్నారు.

– శ్రీధర్ కుమార్, సునీల్ కుమార్

మంచి స్పిన్నర్ అవుతా



స్పిన్ బౌలర్‌గా రాణించడమే నా ధ్యేయం. గతంలో అండర్-14 రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యాను. అండర్-16, 19 రాష్ట్ర ప్రాబబుల్స్‌లో రాణించా. అండర్-19 సౌత్ జోన్ క్రికెట్ పోటీలకు ఎంపికై గుర్తింపు తెచ్చుకున్నాను. ఎస్వీయూ క్రికెట్ జట్టు తరపున సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొని సత్తా చాటా. మంచి స్పిన్నర్‌గా రాణించడమే లక్ష్యంగా ఇక్కడ శిక్షణ తీసుకొంటున్నా.

– దీపక్ సాయి, వాల్మీకిపురం

ప్రతిభకు పదును



రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో ఆడాలనేదే నా లక్ష్యం. 2022లో అండర్-16 ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికై మంచి ప్రతిభ కనబరిచాను. అండర్-19 సౌత్‌జోన్ జట్టుకు ఎంపికై రాణించాను. లెఫ్ట్‌హ్యాండ్ మీడియం పేసర్‌గా రాణించాలని ఉంది. ఇక్కడ నా ప్రతిభకు పదును పెడుతున్నారు.

– రుక్సార్ తబస్సుమ్, పుంగనూరు

ఓపెనర్‌గా రాణిస్తా



రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో ఓపెనర్‌గా రాణించాలని ఉంది. ఇప్పటికే జిల్లా స్థాయిలో వివిధ విభాగాల్లో తొమ్మిదేళ్లుగా ఆడుతున్నాను. ఎస్వీ యూనివర్సిటీ తరపున ప్రస్తుతం సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటున్నా. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలనే తపనతో ఇక్కడ శిక్షణ పొందుతున్నా. కోచింగ్ చాలా బావుంది.

– అకీబ్, గుర్రంకొండ

క్లుప్తంగా

గాలి పడుతుండగా.. టైర్ పేలి..


బాలయ్య మృతదేహం

జమ్మలమడుగు రూరల్ : పట్టణ పరిధిలోని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న పంచర్ దుకాణంలో టైర్ పేలి బాలయ్య (23) అనే యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం జమ్మలమడుగు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన బాలయ్యకు చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోయారు. దీంతో యువకుడు అప్పుడప్పుడు నానమ్మ ఇంటికి వెళ్లేవాడు. మిగతా సమయంలో ఆర్ అండ్ బి అతిథి భవనంలో ఉంటూ వచ్చి పోయే వారికి టీ అందించేవాడు. ఈ మధ్య కాలంలో గురుస్వామికి చెందిన పంచర్ దుకాణం వద్దకు వెళ్లి సేవలు అందిస్తూ ఉండేవాడు. గురువారం సాయంత్రం గురుస్వామి బస్సు టైర్‌కు గాలిపడుతూ వేరే వ్యక్తి రావడంతో బాలయ్యకు అప్పజెప్పి వెళ్లాడు. ఆకస్మాత్తుగా టైర్‌కు గాలి ఎక్కువై పగిలింది. దీంతో బాలయ్య సుమారు 30 అడుగుల దూరంలో పడ్డాడు. ఈ సంఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి.వెంటనే స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయమై ఎస్‌ఐ సుబ్బారావును వివరణ కోరగా దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని,ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

భూ వివాదంలో ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న వెంకటరమణారెడ్డి

సంబేపల్లె : అన్నమయ్య జిల్లా శెట్టిపల్లె పంచాయితీ రెడ్డి మఠ్లవారిపల్లెలో గురువారం భూ వివాదం నేపథ్యంలో ఘర్షణ జరిగింది. ఈ సంఘటనలో వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి గాయపడ్డాడు. ఎస్‌ఐ షరీఫ్ కథనం మేరకు రమణారెడ్డి గ్రామ సమీపంలో మామిడితోట వద్ద పొలం పనులు చేస్తుండగా ఆదే గ్రామానికి చెందిన నాగయ్య, రామచంద్రలు కొడవలితో దాడి చేశారు. తలకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. దాడిచేసిన వారిపై కేసునమోదు చేసి దార్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

బి.కొత్తకోట(అన్నమయ్య జిల్లా) : గుర్తు తెలియని 60–65 ఏళ్ల వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. బి.కొత్తకోట మండలం లోని తుమ్మణంగుట్ట సమీపంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద రైల్వేట్రాక్‌ను సమీపంలో మృతదేహం పడి ఉన్న సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఐదురోజుల క్రితం మృతి చెందినట్టు భావిస్తున్న మృతదేహం కుళ్లిన స్థితిలో ఉంది. శరీరంపై గాయాలు లేకపోవడంతో ఇతను ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదానికి గురై మృతి చెందాడా, లేక హత్యకు గురయ్యాడా అన్నది పోలీసులకు అంతు చిక్కలేదు. మృతునికి బట్టతల, వెంట్రుకలు తెల్లగా ఉన్నాయని, శరీరంపై నీలం, ఆరెంజ్, తెలుపు అడ్డ గీర్రలు కలిగిన హాఫ్ షర్టు, వంకాయ పువ్వు రంగులో డ్రాయర్, నలుపు, నీలం, తెలుగు రంగు గీర్రల లుంగీ ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహానికి శుక్రవారం ఘటనా స్థలంలోనే వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తారని తెలిపారు. మృతదేహం ఆచూకీ తెలిపే ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని చెప్పారు. దీంతో మృతున్ని గుర్తించడం ఇబ్బందికరంగా ఉందని చెప్పారు. మృతుడు ఎవరన్నది తెలిసిన వాళ్లు 9440796738, 9490617891, 9440900707 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అంతరిక్ష కేంద్రం..రండి చూసొద్దాం

- 9వ తరగతి విద్యార్థులకు అవకాశం
- ఏప్రిల్ 3వ తేదీ దాకా రిజిస్ట్రేషన్‌కు గడువు


ఇస్రో కేంద్రం

కడప ఎడ్యుకేషన్ : బాల్య దశలోనే విద్యార్థులను సైన్స్, అంతరిక్ష, సాంకేతిక రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కృషి చేస్తోంది. ఈ ఏడాది యువ విజ్ఞాన కార్యక్రమం(యువిక) కింద 9వ తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది, ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. తమ అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఏప్రిల్ 3 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించింది.

ఎంపిక ఇలా..

8వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కులు 50 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులకు అదనంగా 15 శాతం, ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే క్విజ్‌లో 10 శాతం, సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న వారికి 5 శాతం, ఎన్‌సీసీ, స్కౌట్ విద్యార్థులకు 5 శాతం, ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్గొన్న వారికి 10 శాతం, ఆటలపోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు 5 శాతం కేటాయించి ఎంపిక చేస్తారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న మెరుగైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

చక్కటి అవకాశం

అంతరిక్ష రంగంపై ఆసక్తి కలిగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. 9వ తరగతి విద్యార్థులకు చక్కటి అవకాశం. ఎంపికైన విద్యార్థులు ఇస్రో సంస్థల్లోని శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో చర్చించవచ్చు. ఆస్ట్రో ఫిజిక్స్, ఆస్ట్రో బయాలజీ,మెటీరియల్ సైన్స్, కంప్యూటర్ సైన్సులపై అవగాహన కల్పిస్తారు. శ్రీహరికోటలోని అంతరిక్ష నౌకాశ్రమాన్ని సందర్శించి ఇస్రో చైర్మన్‌తో సంభాషించే అవకాశం కలుగుతుంది.

లక్ష్యం ఇది..

అంతరిక్ష పరిజ్ఞానంలో మన దేశం పలు విజయాలతో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఈ స్ఫూర్తిని విద్యార్థుల్లో నింపి వారిని ఆస్థాయిలో తీర్చిదిద్దేందుకు యువికా ఏర్పాటు చేశారు. ఇలా భావి శాస్త్రవేత్తలను తయారు చేయాలనుకుంటున్నారు. ప్రతిభావంతుల కోసం ఇస్రో ప్రకటన జారీ చేసింది

దరఖాస్తు ఇలా..

ఇస్రో ప్రధాన వెబ్‌సైట్ ఐఎస్ఆర్‌వో.జీవోవి.ఇన్‌లో ఏప్రిల్ 3వ తేదీలోగా హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐఎస్ఆర్ఓ.జీవోవి.ఇన్/యువిక.హెచ్‌టీఎంఎల్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఎంపికైన వారి జాబితా ఆదే నెల 10న వెబ్‌సైట్లో ఉంచుతారు. రెండో విడత ఎంపిక ఏప్రిల్ 20వ తేదీలో పూర్తి చేస్తారు. ఎంపికైతే అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేయాలి. పరిశీలన అనంతరం ఇస్రో తుది జాబితా మే 14 లోగా రిజిస్టర్డ్ ఈ మెయిల్ ద్వారా ప్రకటిస్తుంది. యువికా ప్రోగ్రాం మే 15 నుంచి 26వ తేదీ వరకు ఉంటుంది.

షెడ్యూల్ ఇలా..

రిజిస్ట్రేషన్ గడువు	: 3.4.2023
మొదటి విడత ఎంపిక జాబితా	: 10.4.2023
రెండో విడత	: 20.4.2023
ఎంపికైన వారు ఇస్రో సెంటర్లలో రిపోర్టు చేయడం	: 14.5.2023
యువికా కార్యక్రమం	: మే 15 నుంచి 26 వరకు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో ప్రతి మారుమూల గ్రామంలో ఉన్న విద్యార్థికి కూడా ఉన్నతస్థాయికి చేరుకోవడానికి కల్పిస్తున్న అవకాశాల్లో ఇది ఒకటి. అన్ని యాజమాన్యాల్లో 9వ తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి ఉన్న వారు ఏప్రిల్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9441035830 నంబర్‌లో సంప్రదించాలి.
– మహేశ్వరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి.

విద్యార్థులతో రిజిస్ట్రేషన్ చేయించాలి



జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో తొమ్మిదో తరగతి విద్యార్థులతో ప్రతిభా అన్వేషణ్ పరీక్షలు రాయించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలను కలుసుకునే అవకాశం కలుగుతుంది.ప్రధానోపాధ్యాయులు దీనిని బాధ్యతగా తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించాలి.
– రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

వైభవం.. గండి అంజన్న గ్రామోత్సవం


రథంపై ఊరేగుతున్న స్వామివారు

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామి సన్నిధిలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌ల ఆధ్వర్యంలో స్వామి వారిని పురోహితులు ప్రత్యేకంగా అలంకరించారు.భక్తులకు ప్రసాదంగా పానకం వడపప్పు పంచిపెట్టారు.సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఒంటి వాహనం కల రథంపై ఉంచి ఊరేగించారు.గండి క్షేత్రం నుంచి కోదండరామాలయం, భూమా నందాశ్రమం,ట్రిపుల్ ఐటీ క్రాస్ మీదుగా వీరన్నగట్టుపల్లె వరకు ఊరేగింపు కొనసాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

యువకుల వీరంగం

- చికిత్సలో జాప్యానికి ఆస్పత్రి సిబ్బందిపై దాడి
- ప్రైవేట్ అంబులెన్స్ అద్దాలు ధ్వంసం


ఆస్పత్రి సమీపంలో గొడవ పడుతున్న యువకులు

మదనపల్లె (అన్నమయ్య జిల్లా) : రోడ్డుప్రమాదంలో గాయపడి ఆస్పత్రికి వచ్చిన ఓ వ్యక్తికి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సిబ్బంది చికిత్స అందించడంలో జాప్యం చేస్తున్నారంటూ అతడికి చెందిన వ్యక్తులు ఆస్పత్రి సిబ్బందిపై దాడిచేసి, ప్రాంగణంలో వీరంగం సృష్టించిన ఘటన గురువారం రాత్రి జరిగింది. గాంధీపురం సమీపంలో నివసించే దావూద్ ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో కాలేషా, ధన అనే ఇద్దరు యువకులు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చికిత్స అందించే క్రమంలో నర్సులు సత్వరమే స్పందించలేదని వారితో దావూద్‌తో పాటు వచ్చిన యువకులు వాదనకు దిగారు. సెక్యూరిటీ సిబ్బంది గొడవ పడుతున్న వ్యక్తులను బయటకు తీసుకొస్తుండగా, ఆగ్రహించిన వారు సెక్యూరిటీ సిబ్బందిపై దాడిచేశారు. ప్రమాదంలో గాయపడి ఆస్పత్రికి వస్తే త్వరగా కట్టు కట్టకుండా ఆలస్యం చేస్తారా అంటూ ఘర్షణ పడ్డారు. పోలీసులు వచ్చి సర్దిచెప్పడంతో వెనక్కు తగ్గినట్లు తగ్గిన యువకులు తిరిగి వచ్చి మరోసారి సిబ్బందితో గొడవకు దిగారు. ఇరువర్గాలు ఒకరినొకరు తోసుకుంటుండగా ఓ వర్గం వారు ఆస్పత్రి ఆవరణలో నిలిపి ఉన్న ప్రైవేట్ అంబులెన్స్ అద్దాలు పగులగొట్టారు. దీంతో అంబులెన్స్ డ్రైవర్లు వాహనాలను ధ్వంసం చేసిన వారిని పట్టుకునే క్రమంలో వెంబడించారు. ఆస్పత్రి సమీపంలోని శ్రీకృష్ణ థియేటర్ వద్దకు చేరుకుని మరోసారి అక్కడ ఘర్షణ వాతావరణం సృష్టించారు. దీంతో రాత్రి 8 నుంచి 9.15 వరకు ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో టూటౌన్ ఎస్‌ఐ చంద్రమోహన్ చేరుకుని ఇరువర్గాలలో గొడవలకు కారణమైన దావూద్ అనే వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. కాలేషాను అదుపులోకి తీసుకున్నారు.

ఏపీజీబీతో బజాజ్ అలియెంజ్ ఒప్పందం


పత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రగతి గామీణ బ్యాంకు(ఏపీజీబీ)తో జనరల్ ఇన్‌స్రూ కంపెనీ బజాజ్ అలియెంజ్ ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం మరియాపురంలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్, బజాజ్ అలియెంజ్ జనరల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రోహిత్ జైన్‌లు ఎంఓయూకు సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము కుదుర్చుకున్న ఒప్పందం ఇరు సంస్థలకేగాక ఖాతాదారులకు కూడా ఎంతో ఉపయోగం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ జనరల్ మేనేజర్లు పీఆర్ పద్మేశ్వర్, కె. విజయ్‌భాస్కర్, ఎం. జగదీశ్వర్‌రావు, ఆర్. గిరి బాజాజ్ అలియెంజ్ వైస్ ప్రెసిడెంట్ నీరజ్ శర్మ, నేషనల్ కో ఆర్డినేటర్ శ్రీపాద్, రీజనల్ హెడ్ కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఒకరి అరెస్టు..పరారీలో ఇద్దరు


స్వాధీనం చేసుకున్న దుంగలు, నిందితుడితో డీఎస్పీ నాగరాజు,సీఐ నరేష్‌బాబు

ముద్దనూరు : ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని అరెస్టుచేసినట్లు డీఎస్పీ నాగరాజు పేర్కొన్నారు.గురువారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో సీఐ నరేష్ బాబుతో కలిసి డీఎస్పీ విలేకరులకు వివరాలు వెల్లడించారు. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో మండలంలోని తిమ్మాపురం క్రాస్ వద్ద సీఐ నరేష్‌బాబు వాహనాలు తనిఖీచేస్తున్నారు. ఈ తనిఖీలో అక్రమంగా 11 ఎర్రచందనం దుంగలు కారును స్వాధీనం చేసుకున్నారు. నాగరాజు అనే యువకుడిని అరెస్టు చేశారు.నిందితుడిది వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం సోమయాజులపల్లె.అతని వద్ద నుంచి 2 గొడ్డళ్లు కూడా స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.ఈ కేసులో అన్నమయ్య జిల్లా మదనపల్లె గ్రామానికి చెందిన కుమార్,హరి అనే నిందితులు పరారయ్యారన్నారు.వారిని త్వరలో అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.

ఈతకు వెళ్లి అనంతలోకాలకు..

కురబలకోటలో కర్ణాటక విద్యార్థి మృతి



విద్యార్థి మృతదేహం కోసం రాయుని చెరువులో గాలిస్తున్న గ్రామస్తులు (ఇన్‌సెట్) జయంత్ మృతదేహం

కురబలకోట : అన్నమయ్య జిల్లా కురబకోట మండలం కంటేవారిపల్లెలోని చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి జయంత్(13) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కర్ణాటక రాష్ట్రం ములబాగల్ దగ్గర ఓనంపల్లెకు చెందిన జయంత్ 8వ తరగతి చదువుతున్నాడు ఇతను ఇటీవల మండలంలోని కంటేవారిపల్లెలో ఉన్న పిన్నమ్మ ఇంటికి వచ్చాడు. గురువారం పిన్నమ్మ కుమారులతో కలసి ఊరికి దగ్గరలోని వ్యవసాయ బోరు వద్దకు వెళ్లారు. సాయంత్రం తిరిగి ఇంటికి వస్తుండగా జయంత్ పక్కనే ఉన్న రాయుని చెరువులో ఈత ఆడి వస్తానని వెళ్లాడు. చెరువులోకి దిగిన వెంటనే మునిగిపోయాడు. గట్టున ఉన్న పిన్నమ్మ కుమారులు స్థానికులకు సమాచారం అందించారు. చెరువులో గాలించి మృతదేహం బయటకు తీశారు.ఏకైక కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు బోరున విలపించారు.

ఆటవిడుపు

- కలెక్టర్, ఎస్పీ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్
- ఎస్పీ జట్టు గెలుపు


బ్యాటింగ్ చేస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

రాయచోటి (అన్నమయ్య జిల్లా): నిత్యం విధి నిర్వహణలో బిజీగా గడిపే వారికి క్రీడలతో మానసిక ఒత్తిడి తగ్గి, శారీరక దృఢత్వం పెరుగుతుందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. కలెక్టర్ వర్సెస్ ఎస్పీ జట్ల మధ్య గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పోలీస్ పెరేడ్ మైదానంలో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ పోటీలో రెవెన్యూ టీంకు కలెక్టర్ గిరీషా, పోలీసు టీంకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు కెప్టెన్లుగా వ్యవహరించారు. టాస్ గెలిచిన ఎస్పీ బ్యాటింగ్ ఎంచుకున్నారు. ఎస్పీ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 222 పరుగులు సాధించింది. తర్వాత 223 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కలెక్టర్ టీం అన్ని వికెట్లు కోల్పోయి 112 పరుగులు సాధించింది. దీంతో 111 పరుగుల తేడాతో కలెక్టర్ జట్టు ఓటమిని చవిచూసింది. ఎస్పీ టీంను కలెక్టర్ అభినందించారు. పోటీలో మంచి ప్రతిభను కనపరిచిన ఇరు జట్ల టీం సభ్యులను కలెక్టర్, ఎస్పీలు ప్రశంసించారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, కలెక్టరేట్, రెవెన్యూ, పోలీస్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.


పరుగులు తీస్తున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

జైలర్‌కు పదోన్నతి


సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న కడప కేంద్రకారాగారం సూపరింటెండెంట్ ప్రకాష్

కడప అర్బన్ : కడప కేంద్రకారాగారంలో జైలర్‌గా విధులను నిర్వహిస్తున్న ఏ. సాంబశివరావుకు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ జైల్స్‌గా పదోన్నతి కల్పిస్తూ జైళ్లశాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని కడప కేంద్రకారాగార సూపరింటెండెంట్ ఐ.ఎన్.హెచ్. ప్రకాష్ తెలియజేశారు. సదరు జైలర్ ఇటీవలే అనంతపురం జిల్లా కారాగారం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. కడప కేంద్రకారాగారం అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆరంభం..ఆనందం



స్వామి వారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మేడా, చిత్రంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, ఆయన సతీమణి, స్వామి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

ఒంటిమిట్ట కోదండరాముడి బ్రహ్మోత్సవాలు గురువారం ఆనందోత్సాహాల మధ్య ప్రారంభమయ్యాయి. అంకురార్పణగా వేదపండితులు శాస్త్రోక్తంగా పుట్టమన్ను సేకరించారు. తొమ్మిది రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి.ఇందులో భాగంగా క్షేత్రమంతా విద్యుల్లతలు మెరుపులు చిమ్మాయి. కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.స్వామివారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప


పుట్టమన్ను సేకరిస్తున్న వేద పండితులు


పుట్టమన్ను తీసుకొస్తున్న అర్చకులు


కేరళ వాయిద్యకారుల విన్యాసం